RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 189 | ఆగస్టు 09 ఆదివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 189 | August 09 Sunday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


ఎల్‌నినోతో సాగునీటికి తీవ్ర కష్టాలు: వరికి బదులు ఆరుతడి పంటలే శ్రేయస్కరం - మంత్రి కోమటిరెడ్డి 2

## శ్రీశైలం జలాశయానికి

# కొనసాగుతున్న వరద

### నిండుకుండలా మారిన ప్రాజెక్టు



**శ్రీశైలం జనసంఘర్షణ**
ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఉధృతి ఇంకా కొనసాగుతోంది. జూరాల ప్రాజెక్టు నుండి సుమారు 2,32,308 క్యూసెక్కుల మేర నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 876.20 అడుగులకు చేరింది. అలాగే మొత్తం 215.80 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యానికి గాను ప్రస్తుతం 169.46 టీఎంసీల నీరు ప్రాజెక్టులో నిల్వ ఉంది. వరద ప్రవాహం పెరుగుతుండటంతో అధికారులు కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని ముమ్మరం చేసి,

➢ మిగతా 2వ పేజిలో..

## క్షుద్ర రాజకీయాల పేరుతో

# అసత్య ప్రచారాలు

**సీఎం రేవంత్‌పై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం**

**హైదరాబాద్ జనసంఘర్షణ**
క్షుద్రపూజల పేరుతో అసత్య ప్రచారాలు చేస్తూ క్షుద్ర రాజకీయాలకు పాల్పడుతున్నది కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లోని నందినగంజ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ కోసం కొట్లాడి, ఎన్నో త్యాగాలు చేసిన తమకు అలాంటి చిల్లర రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. హరీశ్ రావు గుడికి వెళితే తప్పుపట్టడం వారి సంస్కృతిని తెలియజేస్తోందని, కాంగ్రెస్ లాగా మేడిగడ్డను, చెక్ డ్యామ్‌లను ధ్వంసం చేసి ఓట్లు దండుకునే ఆలోచన తమకు ఎప్పుడూ లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కరెంటు కోతలు సర్వసాధారణం అయ్యాయని, 24 గంటల ఉచిత విద్యుత్ ఎక్కడ ఇస్తున్నారో ఏ సబ్‌స్టేషన్‌కైనా వచ్చి నిరూపించడానికి తాము సిద్ధమని సవాల్ విసిరారు. హైడ్రా విషయంలో కోర్టుల ఆదేశాలను కూడా లెక్కచేయకుండా రేవంత్ రెడ్డి హిట్లర్‌లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో కింద పట్టాలు ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా కూడా ఇవ్వకపోగా వేలాది మంది పేదల ఇళ్లను కూల్చివేశారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని వేల ఎకరాల పారిశ్రామిక భూముల విషయంలో రేవంత్ రెడ్డి రూ. 5 లక్షల కోట్ల కుంభకోణానికి పాల్పడుతున్నారని, హెల్త్/హిల్ట్




పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును ఎలా దోచుకుంటున్నారో త్వరలో లేఖలు, ప్రజెంటేషన్ల ద్వారా ప్రజల ముందుంచుతామని

➢ మిగతా 2వ పేజిలో..

# 2028 నాటికి భారత్‌లో ఎయిర్ ట్యాక్సీలు

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
దేశంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు 2028 నాటికి ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. బెంగళూరులో 'సర్లా ఏవియేషన్' కొత్త ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన, ఈ నూతన సాంకేతికతపై వచ్చే ఏడాది నుంచి పూర్తిస్థాయి పరీక్షలు వేగవంతం కానున్నట్లు వెల్లడించారు. ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ (వటూూ) విమానాల ద్వారా బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాల్లో సాధారణంగా గంటన్నర నుండి రెండు గంటలు పట్టే ప్రయాణ సమయం కేవలం 20 నుంచి 30 నిమిషాలకు తగ్గుతుందని స్పష్టం చేశారు. డిజిసిఏ (ణ+జూా) నుంచి ఇప్పటికే డిజైన్ ఆర్గనైజేషన్ అనుమతులు పొందిన ఈ ఎయిర్ ట్యాక్సీలో పైలట్‌తో సహా ఆరుగురు ప్రయాణించవచ్చు. మొత్తం 7 ఎలక్ట్రిక్ మోటార్లతో పనిచేసే ఈ విమానంలో గాల్లోనే బ్యాటరీ ఛార్జ్ చేసుకునేలా టర్బో-జెనరేటర్ అమర్చే సదుపాయం కూడా ఉంది. విమానయాన పరికరాలు మినహా మిగిలిన ప్రధాన విడిభాగాలన్నీ స్వదేశంలోనే తయారవుతున్నందున వీటి ప్రయాణ ధరలు సామాన్యులకు సైతం అందుబాటులో ఉంటాయని మంత్రి అభిప్రాయపడ్డారు. నిఖిల్ కామత్ (జెరోధా), బిన్నీ బన్సాల్ (ఫ్లిప్‌కార్ట్) వంటి దిగ్గజాల పెట్టుబడులు ఉన్న ఈ స్టార్టప్‌తో బెంగళూరు ఎయిర్‌పోర్ట్



శంషాబాద్ కనెక్టివిటీ కోసం, అలాగే మణిపాల్ హాస్పిటల్స్ ఎయిర్ అంబులెన్స్ సేవల కోసం ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ సరికొత్త రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తే నగర ప్రయాణాలతో పాటు అత్యవసర వైద్య సేవలు, కార్గో రంగాల్లో భారత్ కొత్త విప్లవం సృష్టించడమే కాక, విదేశాలకు కూడా ఈ ఎయిర్ ట్యాక్సీలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఘోర ప్రమాదం

### పిల్లర్‌ను ఢీకొట్టిన టవేరా కారు, ఇద్దరు దుర్మరణం

**హైదరాబాద్ జనసంఘర్షణ**
హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు వద్ద శుక్రవారం అర్ధరాత్రి తీవ్ర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గచ్చిబౌలి సమీపంలోని నియోపోలీస్ బ్రిడ్జ్ పిల్లర్‌ను వేగంగా వచ్చిన టవేరా కారు బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. గమనించిన తోటి వాహనదారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతులను రాజస్థాన్‌కు చెందిన టైల్స్ కార్మికులు కన్హైయాలాల్ (25), దేరామ్ (24)గా పోలీసులు గురించారు.

➢ మిగతా 2వ పేజిలో..

# హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాలు

### పలు ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు



**హైదరాబాద్ జనసంఘర్షణ**
హైదరాబాద్ నగరంలో ఆగస్టు 9, 10 తేదీల్లో బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్న నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు భారీగా ఆంక్షలు విధించారు. ముఖ్యంగా లాల్ దర్వాజా, కార్వాన్ దర్బార్ మైసమ్మ, అంబర్‌పేట్ మహంకాళి,

# బంగారం ధరలకు మళ్లీ రెక్కలు

**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలుగు రాష్ట్రాల్లో పసిడి ప్రియులకు బంగారం ధరలు మళ్లీ షాక్ ఇస్తున్నాయి. గత కొద్దిరోజులుగా వరుసగా పెరుగుతూ వస్తున్న స్వర్ణ కాంతులు, తాజాగా మరోసారి భారీగా ప్రియమయ్యాయి. తాజా పెంపుతో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు కొత్త రికార్డు స్థాయికి చేరాయి. రోజువారీ ట్రేడింగ్‌లో భాగంగా 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంపై ఏకంగా రూ.1,090 వరకు పెరగ్గా, ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,000 మేర ఎగబాకింది. అదేవిధంగా 18 క్యారెట్ల పసిడి ధర కూడా రూ. 820 మేర పెరిగింది. ప్రసిద్ధ గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం, ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,350 వద్ద నమోదు కాగా, 22



క్యారెట్ల బంగారం ధర రూ. 1,39,650గాను, 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,14,260 వద్ద ట్రేడ్ అవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, రూపాయి మారకం విలువలోని హెచ్చుతగ్గుల కారణంగానే స్థానిక మార్కెట్లో బంగారం ధరలు ఈ స్థాయిలో పరుగులు తీస్తున్నాయని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# క్షుద్ర రాజకీయాల పేరుతో అసత్య ప్రచారాలు

**మొదటిపేజీ తరువాయి...** పేర్కొన్నారు. నీటి వాటాల విషయంలో కేంద్రమైనా, రాష్ట్రమైనా తెలంగాణకు అన్యాయం చేస్తే తీవ్రమైన తిరుగుబాటు తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డికి కనీసం ఎప్పుడు నీళ్లు ఎత్తిపోయాలో కూడా తెలియదని, బీఆర్ఎస్ ప్రతిపక్షంగా ముళ్లకట్టెలతో పొడిస్తేనే ప్రభుత్వానికి స్పృహ వస్తోందని ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వ చెప్పుచేతల్లో, ముఖ్యంగా చంద్రబాబు డైరెక్షన్‌లో తెలంగాణ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. తెలంగాణకు తీవ్ర వ్యతిరేకి అయిన ఆదిత్యనాథ్ దాస్‌ను ప్రభుత్వ సలహాదారుగా నియమించుకోవడం సిగ్గుచేటని, ధైర్యం ఉంటే ఆయన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. వచ్చే జీఆర్ఎంబీ సమావేశం అజెండా పూర్తిగా తెలంగాణ హక్కులను కాలరాసేలా ఉందని, దీనిపై రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని నిలదీశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణలో మరోసారి నీళ్ల దోపిడీ జరిగితే సహించేది లేదని, నార్లాపూర్ ముట్టడిస్తామని హెచ్చరిస్తేనే ప్రభుత్వం దిగివచ్చి పంపులు ఆన్ చేసిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టడం మానుకోవాలని, లేదంటే రాష్ట్ర ఉద్యమాన్ని తలపించేలా మరో పెద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం: లోయలో పడ్డ బొలెరో, ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి

దేవ్ ప్రయాగ్ :
ఉత్తరాఖండ్‌లో శుక్రవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన వారు ప్రయాణిస్తున్న బొలెరో వాహనం లోయలో పడిపోయిన ఘోర ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. దేవ్‌ప్రయాగ్ నుంచి పౌరీకి వెళ్తుండగా సబ్దర్‌ఖల్ వద్ద వాహనం అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న లోయలో పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే దేవ్‌ప్రయాగ్ పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ (రాణ=ఫీ) సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద తీవ్రతకు వాహనంలో ఉన్న ఏడుగురిలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరిన ఇద్దరిలో ఒక బాలుడు చికిత్స పొందుతూ కన్నుమూశాడు. ప్రస్తుతం మరొకరికి ఆసుపత్రిలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు.

## ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

### 15 ఆగస్టున ప్రారంభించనున్న సిఎం

**నిజామాబాద్, ఆగస్ట్8 :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. స్మార్ట్ కార్డు విషయంలో దాదాపు 8 నెలల నుంచి ప్రభుత్వం చేసిన ఆలోచన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. ఆగస్ట్ 15న సంగారెడ్డిలో సిఎం వీటిని ప్రారంభిస్తారు. ఈ స్మార్ట్ కార్డులతో బోగస్ కార్డుల ఎత్తివేత సులువవుతుందని భావిస్తున్నారు. జిల్లాల వారిగా స్మార్ట్ కార్డు పంపిణీ అంశంపై ఆ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌర సర ఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 15 నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తారు. అదేరోజున మిగతా జిల్లాల్లో కూడా ప్రజా ప్రతినిధులు కార్డుల పంపిణీని లాంఛనంగా చేపడతారు. అయితే పంపిణీ వేదికలు, ఏర్పాట్లు తదితర అంశాలపై ఈనెల 11 వరకు స్పష్టత రానుంది. స్మార్ట్ రేషన్ కార్డు ఆకర్షణీయంగా ఉండనుంది. డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో ఈజీగా వాలెట్‌లో పెట్టుకు నేలా ప్రభుత్వం రూపొందించింది. ఆధునిక సాంకేతిక విలువాలతో కార్డు ఆకర్షణీయంగా ఉంటుందని అధికా రులు అంటున్నారు. కొత్త కార్డుల దరఖాస్తు నిరంతర ప్రక్రియ కావడంతో కార్డుల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానే కొత్త కార్డులను అందిస్తారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధికారులు జాబితాను సిద్ధం చేశారు.

## బాబాయి మృతిని తట్టుకోలేక అబ్బాయి ఆత్మహత్య

**ఒంగోలు :** ప్రకాశం జిల్లా కంభంలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. బాబాయి మృతి చెందడాన్ని తట్టుకోలేక ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. బాబాయి మణికుమార్ మృతి చెందిన విషయం తెలుసుకున్న క్లైమ్ బాబు అనే యువకుడు.. తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ బాధలోనే కంభం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. ఒకే కుటుంబంలో వరుసగా ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మణికుమార్ కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితి విషమించడంతో ఆయనను గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ మణికుమార్ మృతి చెందారు. బాబాయి మృతి వార్త క్లైమ్ బాబును తీవ్రంగా కలిచివేసినట్లు తెలుస్తోంది. బాబాయితో ఉన్న అనుబంధం కారణంగా ఆయన మృతిని జీర్ణించుకోలేక తీవ్ర మనోవేదనకు గురైన బాబు.. కంభం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మణికుమార్, ÷-లక్లైమ్ బాబు మృతదేహాలకు కుటుంబ సభ్యులు ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే కుటుంబంలో ఇద్దరి అంత్యక్రియలు ఒకేసారి జరగడం చూసి స్థానికులు సైతం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన కంభం ప్రాంతంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద

**మొదటిపేజీ తరువాయి...** దాదాపు 66,460 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. అంతేకాకుండా కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,133 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 8,000 క్యూసెక్కులు, హంద్రీనీవా పథకానికి 875 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. అయితే కృష్ణా, భీమా నదుల నుంచి నీరు నిండుగా వస్తున్నప్పటికీ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో నీటిని ఎత్తిపోయడం లేదని స్థానిక నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలలో నాలుగు మోటార్లు, కల్వకుర్తి పథకంలో మరికొన్ని మోటార్లు సిద్ధంగా ఉన్నప్పటికీ నీటిని వదలకుండా వృథాగా దిగువకు పంపుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు తుంగభద్ర జలాశయానికి మాత్రం ఇన్?ఫ్లో కాస్త తగ్గుముఖం పట్టింది. డ్యామ్ బోర్డు అధికారుల కథనం ప్రకారం ఉదయం వేళకు 42,114 క్యూసెక్కుల వరద వస్తుండగా, ప్రస్తుతం 72.26 టీఎంసీల నీరు నిల్వ ఉంది. తాగునీటి అవసరాల నిమిత్తం 1,514 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తుండగా, సాగునీటి విడుదలపై ఈ నెల 11న కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

## ఎల్‌నినోతో సాగునీటికి తీవ్ర కష్టాలు: వరికి బదులు ఆరుతడి పంటలే శ్రేయస్కరం - మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్**
ఎల్‌నినో ప్రభావం వల్ల నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీరు కేవలం తాగునీటి అవసరాలకే సరిపోతుందని, పైనుంచి కూడా నీటి ప్రవాహాలు వచ్చే అవకాశం లేనందున రైతులు వరి సాగును విడనాడి ఆరుతడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నాగార్జునసాగర్ నిండినా చెరువులు నింపే పరిస్థితి లేదని, భూగర్భ జలాలు కూడా వేగంగా పడిపోతున్నందున ఈ కష్టకాలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు అండగా నిలవాలని కోరారు. ప్రస్తుతం సాగర్‌లో నీరు డెడ్ స్టోరేజీకి చేరుకుందని, శ్రీశైలం నుంచి ప్రవాహాలు వచ్చినా ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ఎదురయ్యే ముప్పు ఉన్నందున పంట మార్పిడి అత్యంత అవసరమని పేర్కొన్నారు.
నల్గొండ జిల్లాకు శాశ్వత సాగునీటి పరిష్కారమైన ఎస్ఎల్‌బీసీ (సొరంగ) పనులను ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని, ఎంత ఖర్చయినా వెనకాడ వద్దని సీఎం ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ఏఎంఆర్పీ, ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టుల ద్వారా జిల్లాలో 4 లక్షల ఎకరాలకు నీరందుతుందని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 33 వేల ఎకరాల్లో మాత్రమే ఆరుతడి పంటలు వేస్తున్నారని, ఈ విస్తీర్ణాన్ని లక్షన్నర ఎకరాలకు పెంచాలని సూచించారు. నిరంతరం వరి సాగు చేయడం, రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల భూములు సారం కోల్పోతాయని, అందుకే కూరగాయలు, ఉద్యాన పంటలు, సేంద్రియ వ్యవసాయం వైపు రైతులను మళ్లించాలని పిలుపునిచ్చారు. అధికారులు కోరిన 5 వేల స్ప్రింక్లర్ యూనిట్లను తక్షణమే మంజూరు చేస్తామని, ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్ సమస్యను పరిష్కరించేందుకు కొత్త విద్యుత్ సామగ్రి తెప్పిస్తామని హామీ ఇచ్చారు.

## జిల్లాలో సాగునీటి ప్రణాళిక విడుదల చేయాలి

**రైతులకు నీటి వినియోగంపై అవగాహన కల్పించాలి**

**మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ డిమాండ్**

**ఖమ్మం :** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సాగునీటి లభ్యత, వినియోగం, నీటి విడుదలపై రైతులకు ప్రభుత్వం స్పష్టమైన అవగాహన కల్పించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఎల్‌నినో నేపథ్యంలో పంటల సాగుకు అవసరమైన నీటి లభ్యతపై స్పష్టత ఇవ్వడంతో పాటు, రైతులు ముందస్తుగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకునేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షపాతంలో హెచ్చుతగ్గుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాగర్, గోదావరి, మున్నేరు, వైరా, పాలేరు, కిన్నెరసాని తదితర జల వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేసి, ఆయకట్టు రైతులకు ముందస్తుగా సమాచారం
అందించాలని కోరారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో ప్రస్తుతం ఎంత మేరకు నీటి నిల్వలు ఉన్నాయి, ఎప్పుడు నీటిని విడుదల చేస్తారు, ఏ ప్రాంతాలకు ఎంత మేరకు నీరు అందుబాటులో ఉంటుంది అనే వివరాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షించి అధికారికంగా ప్రకటించాలని కోరారు. నీటి విడుదలకు సంబంధించి ముందస్తు షెడ్యూల్ను ప్రకటిస్తే రైతులు పంటల ఎంపిక, సాగు సమయం, నీటి వినియోగంపై సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు.

# ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఘోర ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి...** వీరు ఇంద్రారెడ్డి నగర్ నుంచి నానక్‌రామ్‌గూడ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, పరిమితికి మించిన అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాలు

**మొదటిపేజీ తరువాయి...** చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయాల పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై మళ్లింపులు ఉంటాయని పోలీసులు స్పష్టం చేశారు. లాల్ దర్వాజా బోనాల సందర్భాన్ని పురస్కరించుకుని పాతబస్తీలో ఆగస్టు 9న ఉదయం 6 గంటల నుంచి, అలాగే 10వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఊరేగింపు పూర్తయ్యే వరకు ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలకు చార్మినార్, ఫలక్‌నుమా వైపు అనుమతి ఉండదని వెల్లడించారు. అంతేకాకుండా మదీనా ఎక్స్ రోడ్డు నుంచి నాగుల్ చింతా మీదుగా ఇంజన్ బౌలి వరకు వెళ్లే ప్రధాన రహదారిని ఊరేగింపు ముగిసేవరకు పూర్తిగా మూసివేయనున్నారు.
మరోవైపు కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాలను పురస్కరించుకుని ఆగస్టు 8 రాత్రి 9 గంటల నుంచే పురానాపూల్, జియాగూడ, టప్పాచబుత్రా ప్రాంతాల్లో ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. అంబర్‌పేట్ మహంకాళి ఆలయ పరిసరాల్లో ఆగస్టు 9 ఉదయం 6 గంటల నుంచి 10వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమలు కానున్నాయి; ఆర్టీసీ బస్సులు మరియు భారీ వాహనాలు అంబర్‌పేట్ ఫ్లైఓవర్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఇక చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయం వద్ద రెండు రోజుల పాటు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని, వాహనాలను సీతాఫల్‌మండి, పద్మారావు నగర్ వైపు మళ్లిస్తున్నామని నగర ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. భక్తులు, వాహనదారులు ఈ ఆంక్షలను గమనించి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని కోరారు.

# డిలిమిటేషన్‌పై తమిళనాట ఆసక్తికర సన్నివేశం

**సిఎం విజయ్ నేతృత్వంలో అఖిలపక్ష ఎంపిల భేటీ**

**ఉన్న ఎంపి సీట్లను అలాగే కొనసాగించాలని డిమాండ్**

**చెన్నై, :** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'డీలిమిటేషన్' ప్రక్రియపై తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర రాజకీయ ప్రాతినిధ్యం తగ్గకుండా అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శనివారం చెన్నైలోని కలైవానర్ అరంగంలో తమిళనాడు ఎంపీలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అయితే, రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలతో పాటు పీఎంకే, డీఎండీకే ఈ భేటీని బహిష్కరించడం చర్చనీయాంశమైంది. పార్టీ రాజకీయాలకు అతీతంగా తమిళనాడు హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్, విసికె, సిపిఐ సిపిఎం, ఎండిఎంకె, ఐయూఎంఎల్ పార్టీలకు చెందిన దాదాపు 21 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈ భేటీలో పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 వద్దే ఉంచాలని ఈ సందర్భంగా ఎంపీలు డిమాండ్ చేశారు. తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 39 లోక్‌సభ స్థానాల కేటాయింపులో ఎలాంటి మార్పులు చేయకూడదని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని ఎంపీలు గుర్తుచేశారు. ఇప్పుడు కేవలం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల సంఖ్యను పెంచితే, జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు లబ్ధి చేకూరి, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తీవ్రంగా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు పాత్రను పార్లమెంట్‌లో తగ్గించే ఏ డీలిమిటేషన్ సూత్రాన్నైనా తీవ్రంగా నిరసిస్తామని, లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచితే అది ప్రభావవంతమైన పార్లమెంట్ కాబోదని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం పేర్కొన్నారు. తమిళనాడును ఇన్నేళ్లు పాలించిన డీఎంకే, అన్నాడీఎంకేలు రాష్ట్ర హక్కుల కోసం నిర్వహిస్తున్న భేటీకి రాకపోవడం విచారకరమని, వారికి రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని కాంగ్రెస్ ఎంపీలు ప్రవీణ్ చక్రవర్తి, విష్ణు ప్రసాద్ విమర్శించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన 57 మంది ఎంపీలలో 36 మంది ఈ భేటీకి దూరంగా ఉండటం, విజయ్ ప్రభుత్వానికి స్పష్టమైన ఎజెండా లేదంటూ డీఎంకే ఆరోపించడం.. తమిళనాడు రాజకీయ సమీకరణాలను మరింత ఆసక్తికరంగా మార్చాయి.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ నాణ్యమైన పోలీసింగ్ అందించాలి

- మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో మల్టీ జోన్--1 ఐజీ సమగ్ర తనిఖీ.
- రికార్డులు, దర్యాప్తు ప్రమాణాలు, కేసుల పురోగతి, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై సమీక్ష.
- హోంగార్డు తజ్జుద్దీన్ ఇద్దరు కుమార్తెలను ఎంబీబీఎస్ చదివించడం అభినందనీయం: మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి.




ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 8 (జన సంఘర్షణ)
మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఐపీఎస్, శనివారం మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. ముందుగా గౌరవ వందనం స్వీకరించిన ఐజీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, సిబ్బంది పనితీరు, సాంకేతిక వనరుల వినియోగాన్ని పరిశీలించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాలని ఐజీ సూచించారు. సీసీటీఎన్ఎస్-2.0, ఈ-సాక్ష్య, టీఎస్-కాప్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, బాడీ వోర్న్ కెమెరాలు, డ్రోన్ టెక్నాలజీ వంటి వ్యవస్థలపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. డయల్--112 కాల్స్‌కు తక్షణ స్పందన, విజిబుల్ పోలీసింగ్, బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో సమావేశమైన ఐజీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హోంగార్డు తజ్జుద్దీన్ తన ఇద్దరు కుమార్తెలను ఎంబీబీఎస్ చదివిస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఐజీ, విధులు నిర్వహిస్తూ పిల్లలకు ఉన్నత విద్య అందించడం అభినందనీయమని ప్రశంసించారు. కష్టపడి పనిచేస్తూ పిల్లల ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.పోలీసు సిబ్బంది ఐకమత్యంతో పనిచేస్తూ ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత పెంచేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు,అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐలు వెంకట రాజా గౌడ్, సుభాష్ గౌడ్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓలంపియా స్కూల్‌లో సిబిఎస్ఈ ఖో-ఖో ఛాంపియన్‌షిప్-2026 ప్రారంభం

- క్రీడలతోనే క్రమశిక్షణ నాయకత్వ లక్షణాలు.
- విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి.
- ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించిన మల్టీ జోన్--1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి,




ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 8 (జన సంఘర్షణ)
తూప్రాన్ పట్టణంలోని ఓలంపియా స్కూల్‌లో నిర్వహిస్తున్న జదీూజు ఖో-ఖో ఛాంపియన్‌షిప్--2026 పోటీలను మల్టీ జోన్--1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఖూూ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఖూూ మాట్లాడుతూ, తాను పాఠశాల స్థాయిలో ఖో-ఖో, కబడ్డీ ఆడేవాడినని, ప్రస్తుతం టెన్నిస్ ఆడుతున్నానని తెలిపారు. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలు, టీమ్ స్పిరిట్ పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడలో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న క్రీడాకారులకు శు భాకాంక్షలు తెలియజేశారు. పోటీలను క్రీడాస్ఫూర్తితో, స్నేహపూర్వక వాతావరణంలో పాల్గొనలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఖూూ, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐలు వెంకట రాజా గౌడ్, సందీప్ రెడ్డి, తూప్రాన్ ఎస్ఐ గంగా రాజు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## వర్నిలో ఘనంగా ఎంపీ సురేష్ షెట్కార్ జన్మదిన వేడుకలు

- సంబరాలతో పాటు సేవా కార్యక్రమాలు.. రోగులకు పండ్ల పంపిణీ




వర్ని,/ ఆగస్టు 08/(జన సంఘర్షణ)
జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్ జన్మదిన వేడుకలను వర్ని మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలిచారు. ముందుగా వర్ని మండల కేంద్రంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ సురేష్ షెట్కార్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని నాయకులు భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం వర్ని చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబరాలు చేసుకున్నారు. జన్మదిన వేడుకలను కేవలం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకోవడానికే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ద్వారా ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. ఇందులో భాగంగా స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎంపీ సురేష్ షెట్కార్ ప్రజా సేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో ప్రజలకు మరిన్ని సేవలు అందాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు తదితరులు పాల్గొని ఎంపీ సురేష్ షెట్కార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## రామాయంపేట పట్టణానికి ప్రత్యేక శోభ

- బటర్‌ఫ్లై లైట్లతో ఆకట్టుకుంటున్న ప్రధాన రహదారి.
- అభివృద్ధికి అందం తోడైతే.. రామాయంపేటలో బటర్‌ఫ్లై లైట్ల ప్రత్యేక ఆకర్షణ.
- రామాయంపేట సుందరీకరణలో బటర్‌ఫ్లై లైట్లకు ప్రత్యేక స్థానం.. ఎమ్మెల్యే రోహిత్ రావుకు ప్రజల కృతజ్ఞతలు.
- పట్టణ అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తున్న బటర్‌ఫ్లై లైట్లు.. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావును అభినందిస్తున్న ప్రజలు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 8 (జన సంఘర్షణ)
మెదక్ జిల్లా రామాయంపేట పట్టణ అభివృద్ధి, సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై లైట్లు పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.ఎన్‌హెచ్-47లోని బాలాజీ ఫంక్షన్ హాల్ నుంచి సిద్దిపేట రోడ్డు ఎస్సీ కాలనీ వరకు ఏర్పాటు చేసిన ఈ లైట్లు రామాయంపేట ప్రధాన రహదారికి మరింత అందాన్ని తీసుకొచ్చాయి. రాత్రివేళ బటర్‌ఫ్లై లైట్ల వెలుగులతో ప్రధాన రహదారి ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తుండటంతో పట్టణానికి వచ్చే ప్రజలను సైతం ఆకట్టుకుంటోంది. పట్టణ సుందరీకరణకు తోడ్పడటంతో పాటు రాత్రి వేళల్లో రహదారి మరింత వెలుగులతో కనిపిస్తూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తోంది. రామాయంపేట పట్టణ అభివృద్ధి, సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారించిన మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుకు పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ప్రజల సౌకర్యంతో పాటు పట్టణానికి అందం తీసుకొచ్చే విధంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు అభినందిస్తున్నారు. రామాయంపేట అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై లైట్లు పట్టణ సుందరీకరణకు నిదర్శనంగా నిలుస్తున్నాయని, ఇలాంటి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలని స్థానిక ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.




## బిజెపి మెదక్ జిల్లా కిసాన్ మోర్చా అధికార ప్రతినిధిగా పోలీస్ దేవేందర్ నియామకం



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 8 (జన సంఘర్షణ)
మెదక్ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీలో అక్కన్నపేటకు చెందిన పోలీస్ దేవేందర్‌ని జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్నుకోవడం జరిగింది. దీనికి నూతనంగా జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్నికైన పోలీస్ దేవేందర్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని తప్పకుండా పార్టీ ఆదేశాల మేరకు రైతుల సమస్యల పట్ల పోరాటం చేస్తానని తెలిపారు. మెదక్ జిల్లా కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా ఎంపిక చేసినందుకు గౌరవ మెదక్ ఎంపీ రఘునందన్ రావుకి, మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్‌కి, మెదక్ అసెంబ్లీ కన్వీనర్ రాగి రాముకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

## ఘనంగా పండగ సాయన్న జయంతి

- రామాయంపేట ముదిరాజులు, బీసీ సంఘం నాయకుల ఆధ్వర్యం లో నిర్వహణ.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 8 (జన సంఘర్షణ)
పండుగ సాయన్న జయంతి సందర్భంగా రామాయంపేటలో ముదిరాజ్ సంఘం, బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. జయంతి సందర్భంగా రామాయంపేట లోని గాంధీ విగ్రహం నుండి బస్టాండ్ వరకు ముదిరాజ్ సంఘాలు సదర్ సంఘం నాయకులు బీసీ సంఘం నాయకులు ర్యాలీగా బస్టాండ్ వద్దకు చేరుకొని పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించడం జరిగింది. జయంతికి ముఖ్య అతిథులుగా రామాయంపేట కౌన్సిలర్ గజవాడ నాగరాజు, ద కిస్వామి పుట్టి సందీప్ దేవుని రంజిత్ హాజరయ్యారు. బీసీ సంఘం గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారాం. పచ్చుంటి రాము, రామాయంపేట పట్టణ బీసీ సంఘం అధ్యక్షులు. గుడాల లింగం ముదిరాజ్ సదర్ సంఘం అధ్యక్షులు. దేవుని నర్సింలు ముదిరాజ్ సంఘం నాయకులు రెడ్డమైనా నరేష్. ఇట్లా శ్రీశైలం. సుంకోజి దామోదర్ ముదిరాజ్ నాలుగు బేధాల పెద్దలు సదర సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## మహంకాళి అమ్మవారి బోనాలకు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డికి ఆహ్వానం



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 8 (జన సంఘర్షణ)
రామాయంపేట పట్టణంలో ఆదివారం (9న) ఘనంగా నిర్వహించనున్న శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల, తొట్టెల ఊరేగింపు ఉత్సవాలకు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డికి ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానం పలికారు. శనివారం వారి నివాసానికి వెళ్లిన ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. బోనాల ఉత్సవాలకు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని పద్మ దేవేందర్ రెడ్డిని కోరారు. పట్టణంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధే షబ్బీర్ అలీ లక్ష్యం

- రూ.75.19 కోట్ల పంచాయతీరాజ్ నిధుల మంజూరుపై కాంగ్రెస్ నేత నాగరాజ్ గౌడ్ హర్షం



బీబీపేట్, /ఆగస్టు 08:/(జన సంఘర్షణ)
కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.75.19 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ నిధులు మంజూరు చేయించేందుకు షబ్బీర్ అలీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు తదితర మౌలిక వసతుల అభివృద్ధిపై షబ్బీర్ అలీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని నాగరాజ్ గౌడ్ తెలిపారు. ప్రజల అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆయా రంగాలకు నిధులు మంజూరు చేయించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. షబ్బీర్ అలీ ప్రత్యేక చొరవతో రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయించబడే అవకాశం ఉందని, వాటితో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కామారెడ్డి నియోజకవర్గానికి మహర్దశ రానుందని నాగరాజ్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.75.19 కోట్ల నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, రాష్ట్ర మంత్రివర్గానికి ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రామాయణపేటలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

- మెట్టు గంగారం మెదక్ జిల్లా గౌరవాధ్యక్షుడు బీసీ సంక్షేమ సంఘం.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 8 (జన సంఘర్షణ)
పోచమ్మల గణేష్ అధ్యక్షులు బీసీ యువజన సంఘం మెదక్ జిల్లా.రాగి రాములు. బీసీ రాష్ట్ర నాయకులు సుంకోజు దామోదర్ బీసీ సంక్షేమ సంఘం కోశాధికారి మెదక్ జిల్లా.బక్కన్న గారి యాదగిరి సర్పంచ్ అక్కన్నపేట్.మామిడి సిద్ధ రాములు మెదక్ నియోజకవర్గ ఇన్చార్జ్ బీసీ సంఘం.ఉడుత రాజేశం అధ్యక్షులు బీసీ సంక్షేమ సంఘం రామంపేట మండలం. రెడ్డమైన నరేష్ బీసీ సంఘం జిల్లా నాయకులు.పిట్లా శ్రీశైలం అధ్యక్షులు ధర్మారం గ్రామం. గాండ్ల భాస్కర్ రిటైర్డ్ టీచర్.. పోచమ్మల శ్రీనివాస్ బీసీ జిల్లా నాయకులు.సాకలి నారాయణ ధర్మారం బీసీ నాయకులు.రాధా కిషన్ అక్కన్నపేట బీసీ నాయకులు. కార్యక్రమంలో పాల్గొన్నారు.

జన సంఘర్షణ
ఆదివారం 09 ఆగస్టు 2026

# కామారెడ్డిలో అంతర్ జిల్లా బైక్ దొంగల ముఠా అరెస్ట్

- ఐదుగురు నిందితుల అరెస్ట్.. 4
- బైకులు స్వాధీనం। దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: పోలీసులు

కామారెడ్డి), ఆగస్టు 8/(జనసంఘర్షణ): అంతర్ జిల్లా పరిధిలో వరుసగా మోటార్‌సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేశారు. ముఠాకు చెందిన ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. సదాశివనగర్‌లో జరిగిన బైక్ చోరీపై పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డు వద్ద నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో పలు బైక్ దొంగతనాలకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేశ్ చంద్ర మాట్లాడుతూ.. బైక్ దొంగతనాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా మరింత పెంచామని, నేరాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ వాహనాలను సురక్షితంగా పార్క్ చేసుకోవడంతో పాటు, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ పుష్ప రాజ్‌తో పాటు పోలీసు సిబ్బందిని ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

పోలీసుల ఘాటు హెచ్చరిక:..“బైక్ దొంగతనాలు, ఇతర నేరాలకు పాల్పడే వారిపై కఠిన నిఘా కొనసాగుతోంది. నేరం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. నేరస్థులకు ఎలాంటి అవకాశం ఇవ్వం.”



# సేవా స్ఫూర్తికి ఘన వీడ్కోలు.. శంకర్‌కు ఘన సన్మానం..

- విద్యారంగానికి శంకర్ అందించిన సేవలు చిరస్మరణీయం
- ఎంఈఓ సాయిలు, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ ఎం.ఏ. హకీమ్ అభినందనలు

పోతంగల్,/ ఆగస్టు 8:/( జన సంఘర్షణ) విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే లక్ష్యంగా సుదీర్ఘకాలం విద్యారంగంలో సేవలందించిన విశ్రాంత మండల విద్యాధికారి లోల శంకర్‌కు పోతంగల్‌లో ఘనంగా వీడ్కోలు పలికారు. పోతంగల్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో శనివారం నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమంలో శంకర్‌ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు, కళా ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రతిభను చూసిన అతిథులు వారిని అభినందించారు.

**సేవలకు అభినందనల వెల్లువ....**

కార్యక్రమంలో మండల విద్యాధికారి సాయిలు, పోతంగల్ మండల బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ ఎం.ఏ. హకీమ్ మాట్లాడుతూ.. విద్యాధికారిగా, ఉపాధ్యాయుడిగా లోల శంకర్ అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. విద్యారంగ అభివృద్ధికి ఆయన చేసిన కృషి, విద్యార్థుల పట్ల చూపిన బాధ్యతాభావం ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు.

ఉద్యోగ జీవితానికి పదవీ విరమణ సహజమైన ప్రక్రియేనని, అయితే నిజాయితీగా పనిచేసిన వారి సేవలు మాత్రం పదవీ విరమణతో ముగియవని పేర్కొన్నారు. శంకర్ తన ఉద్యోగ జీవితంలో ఎందరికో ఆదర్శంగా నిలిచారని, ఆయన సేవా స్ఫూర్తి భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. పదవీ విరమణ అనంతరం శంకర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, ఆనందంగా, కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.

**ఉపాధ్యాయులు, విద్యార్థుల అభినందనలు.....**

ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియం ప్రధానోపాధ్యాయురాలు విమల కుమారి, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు రవీందర్ బాబు, ఉపాధ్యాయులు అబ్దుల్ ఖాదర్, తెలుగు పండిట్ జయకృష్ణ, కైర్ ఉన్నీషా, ఫిర్దోస్, అతియ పర్వీన్, ఖయ్యూం ఉన్నీషా తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శంకర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. “ఉద్యోగానికి వీడ్కోలు మాత్రమే.. సేవా జ్ఞాపకాలకు కాదు” అనే సందేశాన్ని చాటుతూ జరిగిన ఈ కార్యక్రమం ఆదర్శప్రాయంగా నిలిచింది.






# కోటగిరిలో అంగరంగ వైభవంగా ఊరుపండుగ వేడుకలు

- గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు..
- పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కోటగిరి, ఆగస్టు 8 (జన సంఘర్షణ): నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో ఊరుపండుగ వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామ పెద్దలు, స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని వివిధ గ్రామ దేవతలకు గ్రామస్తులంతా కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. దీంతో కోటగిరి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకలకు బాన్సువాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆషాఢ మాసంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించడం తెలంగాణ ప్రజల సంప్రదాయమన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తారని తెలిపారు. హైదరాబాద్‌లో లష్కర్ బోనాలతో పాటు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బోనాలు, ఊరుపండుగలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించడం ద్వారా వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండాలని, భూగర్భ జలాలు పెరిగి రైతులకు సాగునీరు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. మంచి వర్షాలతో పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు.



**డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తి చేయాలి**

కోటగిరి గ్రామంలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించాలని అధికారులను పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ఇప్పటికే అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులు పూర్తి చేసుకునేలా అనుమతులు ఇవ్వాలని సూచించారు. ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులను పూర్తిగా చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



**50 పడకల ఆసుపత్రికి సిబ్బంది నియామకం**

కోటగిరిలో నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అవసరమైన సిబ్బందిని నియమిస్తామని పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు, వర్నిలోని ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వర్ని ఆసుపత్రిలో ఇప్పటికే వైద్యులతో పాటు అవసరమైన సిబ్బందిని భర్తీ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్, గ్రామ పెద్దలు గంగాధర్ దేశాయ్, పంది ముక్కుల సాయిలు, కూచి సిద్ధు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చందూరులో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

- అరాచక పాలనకు వ్యతిరేకంగా సాయన్న చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం
- ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బంటు సురేశ్

చందూరు, /ఆగస్టు 8/(జన సంఘర్షణ): నిజామాబాద్ జిల్లా బోధన్ పరిధిలోని చందూరు మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బంటు సురేశ్ మాట్లాడుతూ.. పండుగ సాయన్న ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. అరాచక పాలనకు వ్యతిరేకంగా ప్రజల కోసం ఆయన సాగించిన వీర పోరాటం, ధైర్యసాహసాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన పండుగ సాయన్నను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన చూపిన బాటలో నడుస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత పండుగ సాయన్న జీవిత చరిత్రను తెలుసుకుని ఆయన స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం సంఘం సభ్యులు పండుగ సాయన్న సేవలను స్మరించుకుంటూ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఐక్యత, ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# 10000 రూపాయల ఫిక్స్డ్ డిపాజిట్ బాండు అందజేత

- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, జిల్లా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ అందజేస్తారు.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 8 (జన సంఘర్షణ) మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామానికి చెందిన శరణ్య తల్లి తండ్రి గత కొద్ది రోజుల క్రితం మరణించారు. వారి కుటుంబాన్ని గతంలో ఆర్థిక సహాయం చేసిన రోజు ఫిక్స్డ్ డిపాజిట్ చేస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వారి కుటుంబాన్ని కలిసి కూతురు శరణ్య పేరుపై 10,000 రూపాయలు ఫిక్స్డ్ డిపాజిట్ చేసిన బాండ్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ నర్సింలు, వార్డు మెంబర్లు భూపాల్ రామకృష్ణ నరసింహులు, పార్టీ నాయకులు యాదగిరి, నవీన్, స్వామి, భరత్, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం ఆందోళన



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 8 (జన సంఘర్షణ) దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10న హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో నిర్వహించనున్న మహా నిరసన సభకు మెదక్ జిల్లా క్రైస్తవులు అధిక సంఖ్యలో తరలిరావాలని యూనివర్సల్ చర్చి పాస్టర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో యు సి పి ఏ మెదక్ జిల్లా చైర్మన్ రెవ. ఎన్.బి. సంజీవరావు మాట్లాడుతూ.. ఏఐసిఎఫ్ ఆధ్వర్యంలో జరిగే నిరసన సభకు మద్దతుగా జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సభకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ ప్రతినిధులు పాస్టర్లు కే. జోసెఫ్ పాల్, జె. డేవిడ్ రాజు, వి. దేవదాస్, వి. ఎలీషా, డి. సామ్యేల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మత్స్య సొసైటీకి ఉచిత చేప పిల్లలకు బదులు నగదు జమ చేయాలి

- నిరుద్యోగ యువతకు ఆర్నమెంటల్ ఫిష్ సీడ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రోత్సహించాలి



మంచిర్యాల జిల్లా, హాజీపూర్ మండలం, ఆగష్టు 08(జనసంఘర్షణ): హాజీపూర్ మండలం,ఆగస్టు 10 జైలు బరోకు మత్స్యకారుల సంఘం మద్దతు, తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో హాజీపూర్ మండలంలోని ముల్కల, రాపెల్లి, నంన్నూర్ గుడిపేట, మత్స్యకారుల స్థితిగతులపై సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బోడెంకి చందు మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ ప్రతి మత్స్య సొసైటీకీ ఉచిత చేప పిల్లలకు బదులు నగదు బదిలీ చేయాలని, మత్స్యకార నిరుద్యోగులకు ఫిష్ ఫుడ్ కోర్టులు, ఆర్నమెంటల్ ఫిష్ సీడ్ కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని, ప్రతి మండల కేంద్రంలో చాపల మార్కెట్ నిర్మించాలని ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో మత్స్యకారులకు టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ వాహనాలు అందించాలని, పెండింగ్లో ఉన్న ఎక్స్ గ్రేషియో, ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 10 జైల్ బరో కార్యక్రమానికి మత్స్యకార సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచర్ల రాజేందర్ జిల్లా అధ్యక్షులు, భోగిరి రాజ్ కుమార్ జిల్లా ఉపాధ్యక్షులు గ్రామాల మత్స్యకారులు పాల్గొన్నారు.

# మానవత్వమే మార్గంగా... మృతుల కుటుంబాలకు డాక్టర్ బాదావత్ రవి సానుభూతి

- లకావత్ అంజి, తాటి దుర్గయ్య మృతిపై సంతాపం వ్యక్తం




సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్ సింగరేణి మండలంలోని గుంపెల్లగుడెం గ్రామపంచాయతీ పరిధి చిన్నకట్టగూడెం గ్రామానికి చెందిన ప్రజాపక్షం విలేకరి, మాజీ టీఆర్ఎస్ పార్టీ దిశా కమిటీ సభ్యులు లకావత్ రాము, లకావత్ లక్ష్మణ్ సోదరుల నానమ్మ లకావత్ అంజి అనారోగ్యంతో ఈరోజు మృతి చెందారు. ఆమె మృతిపట్ల మిషన్ వాక్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ బాదావత్ రవి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. లకావత్ అంజి మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్న డాక్టర్ బాదావత్ రవి, మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అదేవిధంగా గుంపెల్ల గూడెం గ్రామానికి చెందిన తాటి దుర్గయ్య ఈరోజు మృతి చెందడంతో ఆయన మరణంపై కూడా డాక్టర్ బాదావత్ రవి సంతాపం వ్యక్తం చేశారు. తాటి దుర్గయ్య మృతి కుటుంబ సభ్యులకు, బంధువులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని పేర్కొన్నారు. సమాజంలో ఎవరికి ఆపద వచ్చినా మానవతా దృక్పథంతో అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డాక్టర్ బాదావత్ రవి అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబాలకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గుంపెల్ల గూడెం చిన్నకట్టగూడెం గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, యువకులు, గ్రామస్తులు, బంధువులు మృతుల కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు.

## జల్... జంగల్... జమీన్ - జోహార్ భీమ్!

నగర నాగరికతకు దూరంగా ఉన్నా
నాగరికతకు మూలమైన మహనీయులు వారు...
మట్టిని తల్లిగా, అడవిని అమ్మగా,
ప్రకృతిని ప్రాణంగా ప్రేమించే ఆదివాసులు వారు!

అడవి ఆకులోనూ జీవాన్ని చూసే మనసు,
చెట్టు నీడలోనూ అనుబంధాన్ని చూసే మనసు,
నదీ ప్రవాహంలోనూ జీవిత గమనాన్ని చూసే మనసు---
స్వచ్ఛమైన ఆత్మలే ఆదివాసీ గుండెలు!






ఈ భరతభూమి పుణ్యభూమిగా వెలగడానికి
అడవిబిడ్డల త్యాగాలెన్నో...
స్వేచ్ఛా జ్వాలలు రగిలించిన
వీరగాథలెన్నో...!

ఆ వీరగాథల నడుమ
ఒక అగ్నిపర్వతంలా ఉద్భవించిన పేరు---
కొమరం భీమ్!

అన్యాయాన్ని ఎదిరించిన అరణ్య సింహం,
ఆదివాసీ ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపం,
హక్కుల కోసం ప్రాణాన్నే పణంగా పెట్టిన
విప్లవ వీరుడు---కొమరం భీమ్!

నిజాం పాలన దోపిడీకి ఎదురొడ్డి,
అడవిబిడ్డల హక్కుల కోసం గర్జించి,
"జల్... జంగల్... జమీన్!" అంటూ
జనహక్కుల జెండాను ఎగరేసిన ధీరుడు!

తన జీవితం కోసం కాదు---
తన జాతి జీవితం కోసం పోరాడాడు...
తన కుటుంబం కోసం కాదు---
తరతరాల ఆదివాసుల భవిష్యత్తు కోసం
తన ప్రాణాన్ని త్యాగం చేశాడు!

తూటాలు దూసుకొచ్చినా
తన అడుగులు వెనక్కి వేయలేదు...
మరణం ఎదురొచ్చినా
తన ఆశయాన్ని వదలలేదు...
శరీరం నేలకొరిగినా
భీమ్ ఆశయం మాత్రం ఎన్నటికీ నేలకొరగలేదు!

నేడు ఆ మహావీరుని విగ్రహం
చర్ల బస్టాండ్‌లో కొలువుదీరుతున్న వేళ---
ఇది కేవలం విగ్రహావిష్కరణ కాదు...
ఇది ఒక చరిత్రకు పునర్జన్మ!
ఒక జాతి ఆత్మగౌరవానికి అభిషేకం!
ఒక పోరాట స్ఫూర్తికి ప్రతిష్ఠ!

ఈ విగ్రహాన్ని చూసిన ప్రతి కన్నులో
ఆత్మవిశ్వాసం వెలగాలి...
ప్రతి యువ గుండెలో
భీమ్ పోరాట స్ఫూర్తి రగలాలి...
ప్రతి అడుగులో
హక్కుల సాధనకు సంకల్పం కనిపించాలి!

ఆదివాసీ సంస్కృతి మన సంపద,
ఆదివాసీ జీవన విధానం మనకు ఆదర్శం,
వారి ప్రకృతి ప్రేమ
భవిష్యత్ తరాలకు భద్రతా మార్గం!

అడవిని కాపాడే చేతులను గౌరవిద్దాం,
ఆదివాసీ హక్కులను పరిరక్షిద్దాం
వారి అభ్యున్నతికి చేయి చేయి కలుపుదాం
అదే భీముకు మన నిజమైన నివాళి
చర్ల గడ్డపై నిలిచిన విగ్రహం
చరిత్రకు చిరునామా కావాలి
ఆదివాసి ఆత్మగౌరవానికి అఖండదీపస్తంభం కావాలి
ప్రతి గిరిజన గూడెం నుంచి దేశం నలుమూలల దాకా ఒకే స్వరం వినిపించాలి

జల్, జంగిల్, జమీన్
అది కేవలం నినాదం కాదు, హక్కుల హృదయ స్పందన
అది కేవలం భీమ్ మాట కాదు, తరతరాల ఆదివాసి ఆత్మగౌరవ గీతం
ప్రపంచ ఆదివాసి దినోత్సవం వేల అడవి బిడ్డలందరికీ మనసారా వందనం
అమరవీరుడు కొమరం భీమ్ కు అక్షర నీరాజనం!


ఆదివాసి ఆత్మగౌరవానికి జోహార్
అడవి బిడ్డల ఐక్యతకు జోహార్!
అమరవీరుడు కొమరం భీమ్ జోహార్!
చర్ల గడ్డపై భీమ్
స్ఫూర్తికి జోహార్ !

జల్, జంగిల్, జమీన్!
జోహార్, జోహార్, జోహార్!

**కలం: బత్తుల వెంకటేశ్వర్లు, చర్ల.**

## ఎత్తొండలో ఘనంగా ఎంపీ సురేష్ షెట్కర్ జన్మదిన వేడుకలు

- **ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలి.. ఆయురారోగ్యాలతో ఉండాలి**
- **కాంగ్రెస్ శ్రేణుల ఆకాంక్ష...**
- **గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్**





ఎత్తొండ, /ఆగస్టు 8/(జన సంఘర్షణ):
జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ జన్మదిన వేడుకలను ఎత్తొండ గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రాజుదేశాయి స్వగృహంలో శనివారం జరిగిన ఈ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి ఎంపీ సురేష్ షెట్కర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజలకు మరింత కాలం సేవలందించాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను పార్లమెంట్ వేదికగా ప్రస్తావిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎంపీకి ప్రజల నుంచి మరింత ఆదరణ లభించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఎత్తొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ తయ్యాబ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూర్యకాంత్, అగ్గ లింగయ్య, బూత్ కన్వీనర్ చందూర్ సాయిలు, నిజామాబాద్ గంగారాం, గ్రామ పెద్ద దశరథ్, బార్లా హనుమంతు, రాశి హనుమంతు, ఆర్. సాయిలు, బక్క సాయిలు, మేతరి సాయిబాబా, ఆల్కే సాయి, షేక్ షబ్బీర్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఎంపీ సురేష్ షెట్కర్ జన్మదిన వేడుకలు గ్రామంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరగడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

## హంగర్గలో ఘనంగా సాయన్న జయంతి వేడుకలు

- **బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సాయన్న చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం**

పోతంగల్,) ఆగస్టు 8:/(జనసంఘర్షణ)



పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో తెలంగాణ వీరుడు సాయన్న జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..బీసీ, బడుగు, బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం సాయన్న చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో అణగారిన వర్గాలకు అండగా నిలిచి, వారి అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుల ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సాయన్న ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని వారు సూచించారు. సాయన్న సేవలు, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గంగాధర్, సర్పంచ్ ఉదయభాస్కర్, ఉప సర్పంచ్ గోపి, శంకర్, సాయితో పాటు గ్రామ పెద్దలు, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా సింగపురం దయాకర్ ప్రమాణ స్వీకారం



జనగామ,/ ఆగస్టు 8/(జన సంఘర్షణ):
జనగామ జిల్లా కేంద్రంలోని భ్రమరాంబ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధనవంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సింగపురం దయాకర్ జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా పార్టీ పదవీ బాధ్యతలకు ప్రమాణ స్వీకారం చేశారు. పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గ సభ్యులతో పాటు వివిధ మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులకు అభినందనలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువగా పనిచేయాలని నాయకులు ఈ సందర్భంగా సూచించారు. నూతన కార్యవర్గంతో జనగామ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని నాయకులు ఆకాంక్షించారు.



## దొంగతనంలో గాయపడిన వృద్ధురాలిని పరామర్శించిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

- **నిందితుడిపై కఠిన సెక్షన్లు నమోదు చేసి, చట్టపరంగా కఠినంగా శిక్షించాలి**
- **పోలీసులకు విజ్ఞప్తి**

కరీంనగర్,/ ఆగస్టు 8/(జన సంఘర్షణ):
కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌లో ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు రాజమ్మపై దుండగుడు దాడి చేసి నగలు దొంగిలించిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజమ్మను చికిత్స నిమిత్తం ఏషియన్ ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నాయకులు తంగెళ్ల కిరణ్తో కలిసి ఆసుపత్రికి వెళ్లి రాజమ్మను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించి, వృద్ధురాలు త్వరగా కోలుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులను కోరారు.

**వృద్ధుల భద్రతపై నిర్లక్ష్యం సహించం**

ఈ సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి చేసి దొంగతనానికి పాల్పడటం అత్యంత దారుణమని అన్నారు. నిందితుడు ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్నందున, ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకుని చట్టపరంగా వర్తించే కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. వృద్ధులు, మహిళలు ఒంటరిగా ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల భద్రత విషయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఇలాంటి ఘటనలు



పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వృద్ధురాలిపై దాడికి పాల్పడిన నిందితుడికి చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కూడా డిమాండ్ చేస్తున్నారు.

## రుద్రూర్‌లో ఘనంగా ఎంపీ సురేష్ షెట్కార్ జన్మదిన వేడుకలు

- **అన్నదానం.. కేక్ కట్ చేసి సంబరాలు**
- **బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వేడుకలు**

రుద్రూర్, /ఆగస్టు 8 /(జనసంఘర్షణ)
జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్ జన్మదిన వేడుకలను రుద్రూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకోవడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎంపీ సురేష్ షెట్కార్ ఆయురారోగ్యాలతో, ప్రజలకు మరింత సేవలందిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుద్రూర్ మండల సర్పంచ్ ఇందూర్ సునీత చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, సర్పంచ్ కొండల్‌వాడి శంకర్,



దిశా కమిటీ సభ్యులు రాంబాబు, నగేష్, రుద్రూర్ ఉపసర్పంచ్ షేక్ నిస్సార్, జిల్లా కార్యదర్శి పత్తి రాము, మాజీ జడ్పీటీసీ నారోజీ గంగారాం, షేక్ గౌస్, దత్తు, కుర్మాజీ సాయిలు, శానం కపిల్, నాగయ్య, వడ్ల నరేష్, ఇమ్రాన్, పార్వతి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



అలాగే వార్డు సభ్యులు అమంద్ వెంకటేష్, రాజా గౌడ్, కర్రోళ్ల పోశెట్టి, శివ, పోతురాజు లింగం, శివశంకర్, కాసుల ఉమామహేష్, బర్ల గంగాధర్, అక్కపల్లి నాగేందర్, విజయ్ కాంత్, రాయకూరు ఉపసర్పంచ్ షేక్ జావీద్ పటేల్, ఫుర్ఖన్, గొల్ల పవన్, ఇందూర్ శ్రీనివాస్, దుర్కి సాయి కుమార్, కరెక సాయి లక్ష్మణ్, చిక్కడపల్లి రవి, సుదర్శన్ గౌడ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎంపీ సురేష్ షెట్కార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థుల హక్కులు.. భవిష్యత్తు కోసం 'శిక్షా రేవల్యూషన్'

- మిర్యాలగూడలో 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలపై చర్చ

మిర్యాలగూడ/, ఆగస్టు 8:/( జన సంఘర్షణ)

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'శిక్షా రేవల్యూషన్' కార్యక్రమానికి మద్దతుగా మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంప్ గ్రౌండ్లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'ఛాత్రోన్ కీ గూంజ్ – విద్యార్థుల సమ్మేళనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) హాజరై విద్యార్థులు, యువత, నిరుద్యోగులతో కలిసి రాహుల్ గాంధీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల గొంతుకను వినడం, వారి సమస్యలను పరిష్కరించడం, నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భవిష్యత్తు అవకాశాలను కల్పించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్యార్థుల ఆకాంక్షలు,




అభిప్రాయాలు, సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 'ఛాత్రోన్ కీ గూంజ్ -- విద్యార్థుల సమ్మేళనం' ద్వారా విద్యార్థులు, యువత తమ విద్య, ఉపాధి, భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం లభించిందన్నారు. దేశ నిర్మాణంలో యువత, విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని, వారి భవిష్యత్తుకు అన్ని



విధాలుగా అండగా నిలవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడితేనే దేశం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, రాజకీయ పార్టీలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు వందలాది మంది విద్యార్థులు, యువత, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేతన నగర్‌లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

- "పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలి" - సర్పంచ్ కాంతాబాయి
- ఆరు నెలలు తల్లిపాలే.. శిశువుకు ఆరోగ్య కవచం

పోతంగల్/ ఆగస్టు 8/(జన సంఘర్షణ):

"అమ్మపాలే బిడ్డకు తొలి అమృతం.. ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు అదే బలమైన పునాది" అని చేతన నగర్ గ్రామ సర్పంచ్ కాంతాబాయి అన్నారు. పోతంగల్ మండలం చేతన నగర్‌లోని అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి కార్యకర్త దుర్పతి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

**ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రాన్ని....**

తల్లిపాల ప్రాధాన్యతను తెలియజేసే సందేశాలు, అవగాహన నినాదాలతో అలంకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ కాంతాబాయి.. తల్లిపాల ప్రాధాన్యతను చాటిచెప్పేలా అంగన్వాడి కార్యకర్తలు రూపొందించిన లోగోను అభినందించారు.అనంతరం గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం, శిశు సంరక్షణ, తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ కాంతాబాయి మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించడం అత్యంత ముఖ్యమని సూచించారు. ముర్రుపాలలో శిశువుకు అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తిని పెంపొందించే గుణాలు అధికంగా ఉంటాయని తెలిపారు. ఇవి శిశువును అనేక రకాల అనారోగ్య సమస్యల నుంచి కాపాడటంతో పాటు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడతాయని అన్నారు. పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా శిశువుకు అవసరమైన పోషకాలు లభిస్తాయని తెలిపారు. తల్లిపాలు బిడ్డ శారీరక ఎదుగుదలతో పాటు మానసిక వికాసానికి కూడా ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రతి తల్లి తల్లిపాల ప్రాధాన్యతను తెలుసుకోవడంతో పాటు.. కుటుంబ సభ్యులు కూడా బాలింతలకు అవసరమైన సహకారం, ప్రోత్సాహం అందించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా గ్రామాల్లో తల్లులు, గర్భిణీలకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. "ఆరోగ్యవంతమైన సమాజానికి ఆరోగ్యవంతమైన శిశువులే బలమైన పునాది. ప్రతి బిడ్డకు తల్లిపాలు అందేలా తల్లులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి" అని కాంతాబాయి సూచించారు.కార్యక్రమంలో చేతన నగర్ అంగన్వాడి కార్యకర్త దుర్పతి, హెగ్డోలి అంగన్వాడి కార్యకర్త కళావతి, బాకర్‌ఫారం అంగన్వాడి కార్యకర్త లక్ష్మీరాజ్యం, ఆయమ్మ నవీన, సారా జాయ్తో పాటు బాలింతలు, గర్భిణీలు శకుంతల, పంచశీల, రాణి, సవిత, శ్రీలత, సావిత్రి, రజిత, పుష్పలత, సంగీత, గంగాబాయి, గంగాసాగర్, శోభ, అంబవ, లాలబాయి, శశికళ, సవిత తదితరులు పాల్గొన్నారు.

**అమ్మపాలు.. బిడ్డకు ఆరోగ్య కవచం....**

"పుట్టిన గంటలోపు ముర్రుపాలు.. తొలి ఆరు నెలలు తల్లిపాలే" అనే సందేశంతో కార్యక్రమంలో తల్లులకు





అవగాహన కల్పించారు. తల్లిపాలను ప్రోత్సహించడం ద్వారా శిశు మరణాల నివారణ, ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడవచ్చని వివరించారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించడం ఒక బాధ్యతగా భావించాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు సూచించారు.

# 150 ఉద్యోగాలు.. వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగులు!

- సరూర్‌నగర్ స్టేడియం వద్ద తోపులాట..
- ఉద్యోగాల కోసం భారీగా పోటీ

హైదరాబాద్, /ఆగస్టు 8: /(జన సంఘర్షణ)



తెలంగాణలో నిరుద్యోగ సమస్య తీవ్రతకు అద్దం పట్టేలా హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియం వద్ద భారీ సంఖ్యలో నిరుద్యోగులు తరలివచ్చారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ ఉద్యోగాల కోసం నిర్వహిస్తున్న ఎంపిక ప్రక్రియలో పాల్గొనేందుకు అభ్యర్థులు పెద్ద ఎత్తున చేరుకోవడంతో స్టేడియం పరిసరాలు కిక్కిరిసిపోయాయి. హైడ్రా పరిధిలో డీఆర్ఎఫ్ అసిస్టెంట్ పోస్టులు 100, హెవీ వెహికల్ డ్రైవర్ పోస్టులు 50



కలిపి మొత్తం 150 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఇందుకోసం ఆగస్టు 8, 9 తేదీల్లో ఉదయం 5 గంటల నుంచి సరూర్‌నగర్ స్టేడియంలో ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

**కఠినమైన ఈవెంట్స్‌లో అర్హత సాధించాలి**

ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు 800 మీటర్ల పరుగును 170 సెకన్లలో, 100 మీటర్ల పరుగును 15 సెకన్లలో పూర్తి చేయడంతో పాటు 4 మీటర్ల లాంగ్ జంప్, 7.2 కిలోల బరువుతో 6 మీటర్ల షాట్‌పుట్ ఈవెంట్లలో అర్హత సాధించాల్సి ఉంటుందని హైడ్రా అధికారులు తెలిపారు. ఉద్యోగాల సంఖ్య తక్కువగా ఉండటంతో భారీ సంఖ్యలో అభ్యర్థులు తరలిరావడంతో సరూర్‌నగర్ స్టేడియం వద్ద రద్దీ నెలకొంది. ఒక్క ఉద్యోగం కోసం వందలాది మంది పోటీపడుతున్న దృశ్యాలు తెలంగాణలోని నిరుద్యోగ సమస్య తీవ్రతను మరోసారి కళ్లకు కట్టినట్లు చూపించాయి.

**ఉద్యోగాల కోసం యువత ఎదురుచూపులు**

చదువులు పూర్తిచేసుకుని ఉద్యోగాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న యువతకు ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో వచ్చే ప్రతి ఉద్యోగ ప్రకటన కీలకంగా మారుతోంది. పరిమిత సంఖ్యలో పోస్టులకు భారీ సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతుండటంతో ఉద్యోగాల కోసం యువత పడుతున్న కష్టాలు ఈ దృశ్యాలతో స్పష్టమవుతున్నాయి.

## శ్రీ మరియమ్మ దేవి ఆలయ పండగకు రూ.10 వేల విరాళం

- "భక్తి, సేవాభావానికి ప్రతీకగా బీఆర్ఎస్ నాయకులు వల్లేపల్లి శ్రీనివాసరావు..

కోటగిరి, )ఆగస్టు 8: /(జన సంఘర్షణ)




కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ మరియమ్మ దేవి ఆలయ పండగ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు వల్లేపల్లి శ్రీనివాసరావు సేవాభావాన్ని చాటుకున్నారు. ఆలయ పండగ నిర్వహణకు తన వంతు సహాయంగా రూ.10,000 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పండగను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. పండగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామంలో ఐక్యత, సోదరభావం పెంపొందేలా అందరూ సహకరించాలని కోరారు. వల్లేపల్లి శ్రీనివాసరావు అందించిన విరాళాన్ని పలువురు నాయకులు అభినందిస్తూ, భక్తి కార్యక్రమాలకు తనవంతు సహకారం అందించడం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొట్టే గజేందర్, విజయ్, నజీర్ పాషా, పి. గంగారం, తేళ్ల చిన్నా, అరవింద్, అంబాటి రాజ గౌడ్, మామిడి నవీన్, మహేష్, జిలాల్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## బోనాలు, ఊర పండుగ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం

వర్ని, ఆగస్టు 8 (జన సంఘర్షణ):



ఆషాఢమాస బోనాల పండుగ సందర్భంగా వర్ని, కోటగిరి మండలాల్లో నిర్వహించిన బోనాలు, ఊర పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే పోచారం పాల్గొన్నారు. అనంతరం కోటగిరి మండల కేంద్రంలో నిర్వహించిన ఊర పండుగ ఉత్సవాల్లోనూ ఆయన పాల్గొని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండుగ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అమ్మవారి భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న యువత

- కల్లు బట్టీలు, ఇతర ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవు.

రుద్రూర్ బాబు రిపోర్టర్ /ఆగస్టు 8:/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో కొందరు యువకులు కల్లు బట్టీలు, బహిరంగ ప్రదేశాలు, ఇతర నిర్మానుష్య ప్రాంతాల్లో మద్యం సేవిస్తూ కనిపిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల యువకులు గుంపులుగా చేరి మద్యం సేవించడంతో పాటు, అనంతరం రోడ్లపై హంగామా చేస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామాలు, ప్రధాన రహదారుల సమీపంలో ఇటువంటి పరిస్థితులు ఏర్పడటంతో ప్రజలు, మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.

**అధికారుల హెచ్చరిక....**

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అధికారులు హెచ్చరించారు. కల్లు బట్టీలు, బహిరంగ ప్రదేశాలు, రహదారుల వెంట మద్యం సేవిస్తున్న వారిపై నిఘా పెంచి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. యువత మద్యం సేవనానికి దూరంగా ఉండి, తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని వారు కోరారు.

# సీపీ సజ్జనార్‌పై మేజిస్ట్రేట్‌కు ఉదయ్ కృష్ణారెడ్డి ఫిర్యాదు

- కస్టడీలో పోలీసులు అనుచితంగా ప్రవర్తించారంటూ ఆరోపణలు..
- విచారణపై అభ్యంతరాలు

హైదరాబాద్, /ఆగస్టు 8: /(జన సంఘర్షణ)




ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కస్టడీ ముగియడంతో పోలీసులు ఆయనను ఉప్పర్‌పల్లి కోర్టులో మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా కస్టడీ సమయంలో పోలీసులు తనతో వ్యవహరించిన తీరుపై ఉదయ్ కృష్ణారెడ్డి మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. నిన్న రాత్రి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఉదయ్ కృష్ణారెడ్డిని విచారించిన సీపీ సజ్జనార్‌పై కూడా ఆయన తీవ్ర ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. విచారణ సమయంలో అభ్యంతరకరంగా మాట్లాడారని, తన కుటుంబ సభ్యులను ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరించారని ఆరోపిస్తూ మేజిస్ట్రేట్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అత్తాపూర్ పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, తనపై అనుచితంగా ప్రవర్తించడంతో పాటు దూషణలకు పాల్పడ్డారని కూడా ఉదయ్ కృష్ణారెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. సీసీటీవీ కెమెరాలు లేని ప్రదేశంలో తనను విచారించారని ఆయన ఆరోపించినట్లు సమాచారం.

**విచారణ చేసిన పోలీసులపై చర్యలు కోరిన ఉదయ్**

కస్టడీ సమయంలో తనను విచారించిన ప్రతి పోలీసుపై ఫిర్యాదు చేసిన ఉదయ్ కృష్ణారెడ్డి.. సీపీ సజ్జనార్‌తో పాటు విచారణలో పాల్గొన్న పోలీసులకు నోటీసులు జారీ చేయాలని మేజిస్ట్రేట్‌ను కోరినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆయన మేజిస్ట్రేట్ ఎదుట భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమైనట్లు తెలుస్తోంది. ఉదయ్ కృష్ణారెడ్డి వాదనలు విన్న అనంతరం మేజిస్ట్రేట్ కోర్టు హాల్ నుంచి ఇతరులను బయటకు పంపించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో రిటైర్డ్ ఏసీపీ పూర్ణచందర్ పేరు కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది.

**అధికారుల హెచ్చరిక**

కస్టడీలో ఉన్న నిందితులు లేదా విచారణకు హాజరయ్యే వ్యక్తుల పట్ల పోలీసులు చట్టపరమైన నిబంధనలు, మానవ హక్కులు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. విచారణ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహించాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఉదయ్ కృష్ణారెడ్డి చేసిన ఆరోపణలు కోర్టు పరిధిలో ఉన్న అంశాలు కావడంతో వాటి వాస్తవాలను సంబంధిత దర్యాప్తు, న్యాయ ప్రక్రియ ద్వారా నిర్ధారించాల్సి ఉంది. ఆరోపణలపై సంబంధిత పోలీసు అధికారుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

# 8 ఏళ్ల బాలికపై అత్యాచారం.. హత్య

- మధ్యప్రదేశ్‌లో కలకలం..
- నిందితుడిని గుర్తించిన పోలీసులు

మధ్యప్రదేశ్, /ఆగస్టు 8:/(జన సంఘర్షణ)



మధ్యప్రదేశ్‌లోని నర్సింగ్‌పూర్ జిల్లాలో 8 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. పాఠశాలకు వెళ్లిన బాలికను ఇంటికి తీసుకువస్తానంటూ ఓ 22 ఏళ్ల యువకుడు సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. అక్కడ బాలికపై అత్యాచారానికి పాల్పడి, అనంతరం ఆమెను హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన అనంతరం అనుమానం రాకుండా కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి బాలిక కోసం గాలింపులో నిందితుడు కూడా పాల్గొన్నట్లు సమాచారం.

**డాగ్ స్క్వాడ్‌తో నిందితుడి గుర్తింపు**

బాలిక ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. డాగ్ స్క్వాడ్ సహాయంతో అనుమానితుడిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం. నిందితుడిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బాలికల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

**అధికారుల హెచ్చరిక**

చిన్నారులను మాయమాటలతో తీసుకెళ్లడం, వారిపై లైంగిక దాడులకు పాల్పడటం వంటి నేరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అధికారులు హెచ్చరించారు. బాలికలు, చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, దర్యాప్తును అన్ని కోణాల్లో కొనసాగిస్తున్నామని పోలీసులు తెలిపారు. నిందితుడిని పోలీసులు కొట్టారన్న విషయంపై అధికారిక ధృవీకరణ లేకపోవడంతో, దర్యాప్తు మరియు న్యాయ ప్రక్రియ పూర్తయ్యే వరకు అలాంటి వివరాలను నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించరాదు.

# వెల్కేర్ ఇండియా నేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2026కు తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి ఆహ్వానం

- న్యాయ అవగాహన, సామాజిక సేవలో పరస్పర సహకారం మరింత బలోపేతం కావాలి

హైదరాబాద్,/ ఆగస్టు 8:/జన సంఘర్షణ)




వెల్కేర్ ఇండియా నేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్--2026 కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. సురేందర్ రెడ్డిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. సొసైటీ ఫర్ సివిల్ లీగల్ ఎయిడ్స్ చైర్మన్ అడ్వకేట్ మీర్ ఖుర్రం అలీ, వెల్ఫేర్ ఇండియా సోషల్ వెల్ఫేర్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు సయ్యద్ తాహేర్ హుస్సేన్తో కలిసి అసోసియేషన్ అధ్యక్షుడిని, కార్యవర్గ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అవార్డుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఎస్. సురేందర్ రెడ్డికి అధికారిక ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది.

**న్యాయ అవగాహన, సామాజిక సేవపై చర్చ**

సమావేశంలో న్యాయ అవగాహనను ప్రజల్లో మరింత విస్తరించడం, సామాజిక సంక్షేమ కార్యక్రమాలను బలోపేతం చేయడం, అలాగే న్యాయవాదుల సంఘాలు, సామాజిక సేవా సంస్థల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించడం వంటి అంశాలపై చర్చించారు. సమాజంలోని అణగారిన వర్గాలకు న్యాయ సహాయం అందించడంతో పాటు, ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించేందుకు సమిష్టి కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.


**పలువురు న్యాయవాదుల పాల్గొనడం**

ఈ సమావేశంలో తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అడ్వకేట్ పి. శ్రావణ్ కుమార్ (కార్యదర్శి), అడ్వకేట్ కె. నిరంజన్ రెడ్డి (కార్యదర్శి), అడ్వకేట్ వి. బాలాజీ బినోత్ (కోశాధికారి), అడ్వకేట్ వి. వర్ధన్ జయసూర్య (క్రీడలు & సాంస్కృతిక కార్యదర్శి), పి. నాయక్ రామావత్ (మాజీ కార్యవర్గ సభ్యుడు)లతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం తమకు ఆత్మీయ స్వాగతం పలికిన తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. తెలంగాణ న్యాయవాదులు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, న్యాయ రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించింది.

# నారీ శక్తి.. మహిళల ప్రతిభను తక్కువ అంచనా వేయొద్దు!

- వినూత్న పరిశోధనలతో దేశానికి గర్వకారణంగా నిలుస్తున్న మహిళా శాస్త్రవేత్తలు

లక్నో/ఆగస్టు 8/(జన సంఘర్షణ)



లక్నో: మహిళలు ఏ రంగంలోనైనా పురుషులకు ఏమాత్రం తీసిపోరని మరోసారి నిరూపిస్తున్నారు. లక్నోలోని సెంట్రల్ డ్రగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ లో పనిచేస్తున్న మహిళా శాస్త్రవేత్తల ప్రతిభ, పరిశోధనా నైపుణ్యాలు ప్రస్తుతం ప్రశంసలు అందుకుంటున్నాయి. సంస్థ డైరెక్టర్ డాక్టర్ రాధా, శాస్త్రవేత్తలు మౌనిక, రీతూలు వినూత్న పరిశోధనలతో తమ ప్రతిభను చాటుతూ దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని ఓ వ్యక్తి ప్రశంసించారు. వారి కృషిని అభినందిస్తూ రూపొందించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మహిళలకు అవకాశం కల్పిస్తే శాస్త్ర, సాంకేతిక, వైద్య, విద్య తదితర అన్ని రంగాల్లో అద్భుతమైన ఫలితాలు సాధించగలరని ఈ మహిళా శాస్త్రవేత్తల విజయాలు చాటుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**మహిళా శక్తికి ఇదే నిదర్శనం**

భారతీయ మహిళల మేధాశక్తి, ప్రతిభ, సామర్థ్యాలను ఎప్పుడూ తక్కువగా అంచనా వేయకూడదని, వారికి ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే దేశ ప్రగతిలో మరింత కీలక పాత్ర పోషించగలరని పేర్కొన్నారు. మహిళలు సాధిస్తున్న విజయాలు నేటి యువతులకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని, "నారీ శక్తి"కి సరిహద్దులు లేవని ఈ ఘటన మరోసారి చాటి చెబుతోంది.

## కరెన్సీ నోట్లపై గాంధీజీ చిత్రం ఎప్పటి నుంచి ఉంది?

- 1996 నుంచి అన్ని నోట్లపై మహాత్ముడి చిత్రం..
- అంతకుముందు నోట్లపై ఏముండేదంటే?

న్యూఢిల్లీ, /ఆగస్టు 8:/జన సంఘర్షణ)




భారత కరెన్సీ నోటును చేతిలోకి తీసుకున్న ప్రతిసారీ కనిపించే మహాత్మా గాంధీ చిత్రం వెనుక ఆసక్తికరమైన చరిత్ర ఉంది. ప్రస్తుతం అన్ని విలువల నోట్లపై గాంధీజీ చిత్రం కనిపిస్తున్నప్పటికీ, స్వాతంత్ర్యం అనంతరం కరెన్సీ నోట్లపై ఆయన చిత్రం వెంటనే రాలేదు. బ్రిటిష్ పాలనలో భారత కరెన్సీ నోట్లపై కింగ్ జార్జ్-6 చిత్రం ఉండేది. స్వాతంత్ర్యం అనంతరం 1949లో భారతీయ చిహ్నాలతో కొత్త నోట్ల రూపకల్పన ప్రారంభమైంది. తొలిదశలో అశోక స్తంభం ప్రధాన చిహ్నంగా ఉండగా, అనంతరం వివిధ విలువల నోట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసింది.

**వివిధ నోట్లపై విభిన్న చిత్రాలు**

1954లో విడుదలైన అధిక విలువ కలిగిన నోట్లపై కూడా విభిన్న చారిత్రక కట్టడాలు, జాతీయ చిహ్నాలకు చోటు కల్పించారు. 1,000 నోటుపై తంజావూరు ఆలయం, 5,000 నోటుపై గేట్‌వే ఆఫ్ ఇండియా, 10,000 నోటుపై అశోక స్తంభం వంటి చిత్రాలు ఉండేవి.

**1969లో తొలిసారి గాంధీజీ స్మారక నోట్లు**

మహాత్మా గాంధీ శతజయంతి సందర్భంగా 1969లో ఆయన చిత్రంతో ప్రత్యేక స్మారక కరెన్సీ నోట్లు విడుదలయ్యాయి. ఇది కరెన్సీపై గాంధీజీ చిత్రానికి సంబంధించిన ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.ఆ తర్వాత 1987లో 500 నోటుపై గాంధీజీ చిత్రంతో కొత్త సిరీస్ విడుదలైంది. క్రమంగా గాంధీజీ చిత్రం భారత కరెన్సీకి గుర్తింపుగా మారింది.


**1996 నుంచి 'మహాత్మా గాంధీ సిరీస్'**

చివరగా 1996 నుంచి విడుదలైన మహాత్మా గాంధీ సిరీస్‌లో వివిధ విలువల నోట్లపై గాంధీజీ చిత్రాన్ని ప్రధానంగా ఉపయోగించడం ప్రారంభించారు. అప్పటి నుంచి భారత కరెన్సీ నోట్లతో గాంధీజీ చిత్రం విడదీయరాని అనుబంధంగా మారింది. అంటే.. గాంధీజీ చిత్రం భారత నోట్లపై మొదట 1969లో స్మారక నోట్ల రూపంలో కనిపించగా, 1996 నుంచి సాధారణ కరెన్సీ నోట్ల సిరీస్‌లో విస్తృతంగా కొనసాగుతోంది.

## సైదన్నకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

- ఆత్మీయంగా అభినందించిన పోతంగల్ ప్రెస్ క్లబ్ మిత్రులు

కోటగిరి, ఆగస్టు 8(జన సంఘర్షణ)






కోటగిరి ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు సైదన్న జన్మదినం సందర్భంగా పోతంగల్ ప్రెస్ క్లబ్ మిత్రులు ఆయనను ఘనంగా సన్మానించి, ఆత్మీయంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోతంగల్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు గంధపు దత్తు మాట్లాడుతూ.. సైదన్న పాత్రికేయ రంగంలో ముందుకు సాగుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యలకు అక్షరరూపం ఇస్తూ, ప్రజల గొంతుకగా నిలుస్తున్న సైదన్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పాత్రికేయ వృత్తి పట్ల ఆయన చూపుతున్న అంకితభావం, సమాజం పట్ల ఉన్న బాధ్యత యువ పాత్రికేయులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సైదన్న నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం పోతంగల్ ప్రెస్ క్లబ్ మిత్రుల తరపున సైదన్నకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ సమాజానికి మరింత సేవ చేయాలని మిత్రులు ఆకాంక్షించారు.. ఆయన పేర్కొన్నారు.

# నిజమే... పోలీస్ శాఖలో అవినీతి పెరిగింది!

- సొంత శాఖలో అవినీతిపై డీజీపీ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు
- నిజాలను ధైర్యంగా అంగీకరించిన ఉన్నతాధికారి

హైదరాబాద్ /ఆగస్ట్ 8/(జన సంఘర్షణ)



పోలీస్ శాఖలో అవినీతి పెరిగిందని స్వయంగా డీజీపీ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పోలీస్ శాఖలోని అవినీతి, అక్రమాలపై తన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. "పోలీస్ శాఖలోని కొంతమంది అధికారులు అవినీతికి పాల్పడుతున్న విషయం వాస్తవమేనని డీజీపీ పేర్కొన్నారు. ఉన్నతస్థాయి నుంచి కింది స్థాయి వరకు కొంతమంది అధికారులు అవినీతికి పాల్పడుతున్నారనే అంశం తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. గతంలో తాను ఏసీబీ విభాగంలో పనిచేసిన సమయంలో పోలీస్ శాఖకు సంబంధించిన పలు అవినీతి అంశాలు తన దృష్టికి వచ్చినట్లు సీవీ ఆనంద్ వెల్లడించారు. పోలీస్ శాఖను మరింత ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

**నిజాలను అంగీకరించడం కూడా నాయకత్వమే.....**

సొంత శాఖలో లోపాలను దాచిపెట్టకుండా, ప్రజల ముందే వాటిని అంగీకరించడం ఉన్నతాధికారిగా డీజీపీ సీవీ ఆనంద్ చూపిన ధైర్యానికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు. శాఖలో లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దేందుకు ప్రయత్నించాల్సిన అవసరం ఉందనే సందేశాన్ని ఆయన వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.
సరైన పర్యవేక్షణ, నిరంతర మానిటరింగ్ లోపిస్తే అవినీతి పెరిగే అవకాశం ఉందని డీజీపీ పేర్కొన్నట్లు సమాచారం. పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంచేందుకు అవినీతికి అడ్డుకట్ట వేసి, పారదర్శకమైన పాలన అందించాల్సిన అవసరం ఉందనే చర్చకు ఆయన వ్యాఖ్యలు దారితీశాయి. సొంత శాఖలోని లోపాలను ధైర్యంగా బయటపెట్టి, వాటిని సరిదిద్దాల్సిన అవసరాన్ని చెప్పిన డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యలు అధికార వ్యవస్థలో నిజాయితీ, జవాబుదారీతనానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

# వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు

- తక్కువ నీటితో పంటలను కాపాడుకునేలా రైతులకు సాంకేతిక సూచనలు ఇవ్వాలి
- నీటి వినియోగంలో మితవాదం పాటించాలి: పోచారం శ్రీనివాసరెడ్డి

నిజామాబాద్, /ఆగస్టు 8:/జన సంఘర్షణ)



ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సూచించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో ఇంచార్జి కలెక్టర్ భవేష్ మిశ్రా ఐఏఎస్ అధ్యక్షతన శనివారం రైతుల సమస్యలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయి అధికారులు, ఇరిగేషన్, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**వరి పంటకు నీటి కొరత ప్రభావం**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిపోవడంతో ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంట తీవ్రంగా ప్రభావితమవుతోందని పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నీటి కొరత పరిస్థితుల్లో పంటలను ఎలా సంరక్షించుకోవాలనే అంశంపై రైతులకు తక్షణమే శాస్త్రీయ, సాంకేతిక సలహాలు అందించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుత వానాకాలంలో వరి సాగు కష్టసాధ్యంగా మారుతున్న నేపథ్యంలో రైతులు పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు.

**నిజాంసాగర్ నీటిపై ముందస్తు ప్రణాళిక**

నిజాంసాగర్ ప్రాజెక్టులో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేకపోవడం భవిష్యత్‌లో నీటి పంపిణీపై ప్రభావం చూపే అవకాశం ఉందని పోచారం తెలిపారు. అందువల్ల ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న నీటిని మితంగా, సమర్థవంతంగా వినియోగిస్తూ, అవసరానికి అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో నీటిని విడుదల చేయాలని స్పష్టం చేశారు.

**ప్రతి గ్రామంలో రైతులకు అవగాహన**

వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అందించే సూచనలు రైతులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు కూడా పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకుని నీటిని పొదుపుగా వినియోగించడం, వ్యవసాయ అధికారుల సాంకేతిక సూచనలు పాటించడం ద్వారా పంటలను కాపాడుకోవాలని సూచించారు.

**రైతులకు అండగా ప్రభుత్వం**

వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వ్యవసాయ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పోచారం శ్రీనివాసరెడ్డి సూచించారు. రైతుల సమస్యలను గ్రామస్థాయి నుంచే గుర్తించి పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు.
ప్రస్తుత పరిస్థితుల్లో నీటి విలువను గుర్తించి ప్రతి చుక్కను సద్వినియోగం చేసుకోవడం, తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యత ఇవ్వడం రైతులకు, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# 'రెంట్ ఏ బాయ్‌ఫ్రెండ్' మోసాలపై జాగ్రత్త!

- ఏఐతో నకిలీ ప్రొఫైళ్లు.. యువతులు అప్రమత్తంగా ఉండాలి: సీపీ సజ్జనార్

హైదరాబాద్, /ఆగస్టు 8/(జన సంఘర్షణ):




సోషల్ మీడియా వేదికగా కొత్త తరహాలో సాగుతున్న 'రెంట్ ఏ బాయ్‌ఫ్రెండ్' పేరుతో సైబర్ మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. ఆకర్షణీయమైన ప్రొఫైళ్లను చూపించి యువతను తమ వలలోకి లాగేందుకు సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్లు కృత్రిమ మేధస్సు సాంకేతికతను ఉపయోగించి ఆకర్షణీయమైన యువకుల ఫొటోలు, నకిలీ వివరాలతో సోషల్ మీడియా ప్రొఫైళ్లను రూపొందిస్తున్నారని సీపీ తెలిపారు. అనంతరం పరిచయం పెంచుకుని వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, బ్యాంకు సమాచారం సేకరించడం లేదా డబ్బులు డిమాండ్ చేయడం వంటి మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు.

**అపరిచితుల వలలో పడొద్దు**

సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తులు పంపే ఫ్రెండ్ రిక్వెస్టులు, మెసేజ్‌లు, వీడియో కాల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సజ్జనార్ సూచించారు. ఆకర్షణీయమైన ప్రొఫైల్ కనిపించిందని వెంటనే నమ్మకుండా, వ్యక్తి నిజమైనవాడా కాదా నిర్ధారించుకున్న తర్వాతే స్పందించాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పద లింకులు పంపినా, వ్యక్తిగత ఫొటోలు లేదా బ్యాంకు వివరాలు అడిగినా స్పందించవద్దని, మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

**తల్లిదండ్రులూ అప్రమత్తంగా ఉండాలి**

తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు సోషల్ మీడియాలో ఎవరితో మాట్లాడుతున్నారు? ఎలాంటి గ్రూపులు, యాప్‌లు ఉపయోగిస్తున్నారు? అనే విషయాలపై అవగాహన కలిగి ఉండాలని సీపీ సూచించారు. పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడి, సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని కోరారు. సైబర్ నేరగాళ్లకు వ్యక్తిగత సమాచారం అందించకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని అధికారులు హెచ్చరించారు.

# ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించాలి

- సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై విస్తృత అవగాహన కల్పించాలి
- ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి: జోన్-11 బాసర డీఐజీ ఆర్. భాస్కరన్

నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 8:/(జన సంఘర్షణ)





ప్రజలకు మరింత సమర్థవంతమైన, స్నేహపూర్వక పోలీసింగ్ అందించడంలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జోన్-11 బాసర డీఐజీ ఆర్. భాస్కరన్ సూచించారు. శనివారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బోధన్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న డీఐజీకి పోలీసు అధికారులు, సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన భద్రతా పరికరాలు, ఆయుధాల నిర్వహణ, రికార్డుల సంరక్షణ తదితర అంశాలను సమీక్షించారు.

**ఫిర్యాదుదారులను గౌరవంగా చూడాలి**

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడిని గౌరవంగా స్వాగతించి, వారి సమస్యలను ఓర్పుతో విని ఫిర్యాదు అందిన వెంటనే స్పందించాలని సిబ్బందిని డీఐజీ ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, అత్యవసర సహాయం కోరేవారి ఫిర్యాదులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రిసెప్షన్ సెంటర్‌లో ఫిర్యాదుల నమోదు విధానం, రిజిస్టర్ల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు.

**పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి**

పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు, బీట్ డ్యూటీ వ్యవస్థ, రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా తదితర అంశాలను డీఐజీ సమీక్షించారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న ప్రతి కేసుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలని సూచించారు.

**సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన**

సులభంగా అధిక డబ్బు సంపాదించాలనే ఆశతో యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమింగ్ యాప్‌లకు ఆకర్షితులై సైబర్ మోసగాళ్ల బారిన పడుతున్నారని డీఐజీ పేర్కొన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, అనుమానాస్పద గేమింగ్ యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.
పాఠశాలలు, కళాశాలల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సోషల్ మీడియా ద్వారా సైబర్ నేరాల నివారణపై ప్రచారం చేయాలని సూచించారు.

**డ్రగ్స్‌పై ఉక్కుపాదం**

డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై యువతను నిరంతరం చైతన్యపరచాలని డీఐజీ సూచించారు. అన్ని గ్రామాల్లో డ్రగ్స్ వినియోగం నిషేధంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టి, యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సరిహద్దుల్లో నిఘా పటిష్టం చేయాలి**

బోధన్ పోలీస్ స్టేషన్ పరిధి మహారాష్ట్ర సరిహద్దుకు ఆనుకుని ఉన్నందున ప్రధాన రహదారులు, సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింత పటిష్టం చేయాలని డీఐజీ ఆదేశించారు. గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న విలేజ్ పోలీస్ ఆఫీసర్లు ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

**ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**

ప్రధాన కూడళ్లలో ప్రతిరోజూ ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చేపట్టి ట్రాఫిక్ సమస్యలను అధిగమించాలని డీఐజీ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చైతన్యం తీసుకురావాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో అమలవుతున్న '5 ఎస్ విధానం', పరిసరాల పరిశుభ్రత, రికార్డుల డిజిటల్ నిర్వహణ, సిబ్బంది హాజరు, డ్యూటీ విధానాలను కూడా ఆయన పరిశీలించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం మరింత పెరిగేలా క్రమశిక్షణతో, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించాలని డీఐజీ ఆర్. భాస్కరన్ అధికారులను హెచ్చరించారు. ఈ తనిఖీలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, బోధన్ ఏసీపీ పి. శ్రీనివాస్, బోధన్ ఎస్‌హెచ్‌ఓ వెంకటనారాయణ, బోధన్ ట్రాఫిక్ ఎస్ఐ మహేష్, బోధన్ టౌన్ ఎస్ఐ హబీబ్ ఖాన్తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ఎంపీ సురేష్ షెట్కర్ జన్మదిన వేడుకలు

- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ..
- ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష

బాన్సువాడ, /ఆగస్టు 8:/(జన సంఘర్షణ)



జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ జన్మదిన వేడుకలను బాన్సువాడలో రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎంపీ సురేష్ షెట్కర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినాన్ని పురస్కరించుకుని బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన నాయకులు, అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రజా సేవకు అంకితమైన ఎంపీ సురేష్ షెట్కర్ ఆయురారోగ్యాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో మరిన్ని సంవత్సరాలు ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో నిర్వహించడం అభినందనీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధుల జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలుగా నిర్వహించడం ద్వారా సమాజానికి స్ఫూర్తినివ్వవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అసద్ బిన్ మోసీన్, జిల్లా యువజన అధ్యక్షుడు మధుసూదన్, షాహబ్, రవీందర్ రెడ్డి, అశోక్ రెడ్డి, గుడాల నగేష్, కొట్టం గంగాధర్, గోపాల్ రెడ్డి, నార్ల రవీందర్, ఎజాస్, హకీమ్, నర్సన్న చారి, శివదయాళ్, వెంకన్న, సెట్ రమేష్, కాశీరాం, షోయెబ్, గౌస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co